ఆరోగ్య సురక్ష పేదలకు రక్ష

- రెండో విడత వైద్య శిబిరాలకు విశేష స్పందన

మడకశిరరూరల్: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం రెండో విడత కింద మంగళవారం పలు ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. వైద్య నిపుణులు రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. శిబిరాలకు రోగులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వైద్యం చేయించుకున్నారు. మడకశిర మండలం ఆర్ ఆనంతపురం ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని జిల్లా ఆరోగ్య సురక్ష నోడల్ అధికారిణి శ్రీదేవి, డిప్యూటీ డీఎంహెచ్ఓ సందర్శించారు. వైద్య చికిత్సలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. పైసా ఖర్చు లేకుండా అన్ని రకాల వ్యాధులకు డాక్టర్లు కార్పొరేట్ ఆస్పత్రి తరహాలో వైద్య చికిత్సలు అందిస్తున్నారని ప్రజలు తెలిపారు. సర్పంచ్ అంజినమ్మ, మండల జేసీఎస్ కన్వీనర్ నాగేంద్రయాదవ్, ఎంపీడీఓ సోనిబాయి, మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడు బాబిరెడ్డి, డాక్టర్ మాధుర్య, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేష్, హరీష్, సిద్దగంగప్ప పాల్గొన్నారు.


మడకశిర మండలం ఆర్.అనంతపురంలో వైద్య శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న జిల్లా నోడల్ అధికారిణి శ్రీదేవి, డిప్యూటీ డీఎంహెచ్ఓ మంజువాణి


లేపాక్షి మండలం కల్లూరులో వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

అగళి: హళ్లికెర గ్రామంలో వైద్యులు శివానంద, గాయత్రి, ప్రణీత్ కుమార్, మహమ్మద్ చాందిలు 248 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎంపీడీఓ రవిప్రసాద్, పంచాయతీ కార్యదర్శి వేణు తదితరులు పాల్గొన్నారు.

కొర్లెవులో వైద్య శిబిరం

అమరాపురం: హేమావతి గ్రామ సచివాలయం- 2 పరిధిలోని కొర్రెవులో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ అంబరీష్, ఎంపీహెచ్ఈఓ ఉమాపతి రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఎంపీపీ ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల: రత్నగిరి ఆదర్శ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో వైద్యులు సౌందర్య, అమరేష్‌గౌడు, అబ్దుల్‌సలాం, అనిల్ తదితరులు 325 మందికి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. 88మందికి కంటి అద్దాలు అందించారు. సర్పంచ్ చిన్నరంగప్ప పీహెచ్ఎన్ సుధారాణి పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్: దుద్దేబండ గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని నిర్వహించారు. దాదాపు 320 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందించినట్లు గుట్టూరు పీహెచ్‌సీ డాక్టర్ నాగరాజునాయక్ తెలిపారు.

లేపాక్షి: మండలంలోని కల్లూరు ప్రాథమిక పాఠశాలలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 272 మందికి వైద్య సేవలు అందించారు. వైస్ ఎంపీపీ నీలావతి, సర్పంచ్ వసుంధర, ఎంపీడీఓ నరసింహనాయుడు, వైద్యాధికారులు రాజ్‌కుమార్, ప్రశాంత్‌బాబు, జక్కా నరేంద్ర, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎయిడ్స్‌పై అప్రమత్తంగా ఉండండి


మాట్లాడుతున్న ఏటీఎల్ లలిత

పెనుకొండ: ఎయిడ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆర్టీటీ ఏటీఎల్ లలిత పేర్కొన్నారు. పట్టణంలోని పలువురు ఆటో డ్రైవర్లకు మంగళవారం ఆమె ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎయిడ్స్ అంటు వ్యాధి కాదని, అయితే అసురక్షితమైన లైంగిక చర్యలతో వ్యాధి సోకే ప్రమాదం ఉందన్నారు. ఎయిడ్స్ బాధితులు ఆధునిక వైద్యంతో సురక్షితమైన జీవనం కొనసాగించవచ్చన్నారు. ఎయిడ్స్ సోకిన వారిని చిన్న చూపు చూడరాదని, వారి పట్ల అభిమానంతో వ్యవహరించాలన్నారు. కోఆర్డినేటర్ సాంబ, ఆటో డ్రైవర్ల యూనియన్ నేత లక్ష్మానాయక్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మె విరమించి విధుల్లో చేరండి


కార్మికులతో మాట్లాడుతున్న కమిషనర్ ప్రభాకర్‌రావు

మడకశిర: సమ్మె విరమించి విధుల్లో చేరాలని మున్సిపల్ కార్మికులకు కమిషనర్ ప్రభాకర్‌రావు సూచించారు. మంగళవారం ఆయన కార్మికులతో సమావేశమై మాట్లాడారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని తెలిపారు. సమ్మెతో పారిశుద్ధ్య పనులు ఆగిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే సమ్మె విరమించి విధుల్లోకి చేరాలని కోరారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి


కాలనీలో పర్యటించిన కమిషనర్ ప్రభాకర్‌రావు

మడకశిర: మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్‌రావు మంగళవారం 17వ వార్డు పరిధిలోని యాదవ, ఎస్సీ కాలనీల్లో పర్యటించి ప్రజలనుంచి సమస్యలు తెలుసుకున్నారు. తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఏఈ మురళి,కౌన్సిలర్ నాగేంద్ర తదితర అధికారులు పాల్గొన్నారు.

మోడల్ పేపర్ల పంపిణీ


మోడల్ పేపర్లను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

రొద్దం: దొడగట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదోతరగతి విద్యార్థులకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో మోడల్ పేపర్లను పంపిణీ చేశారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించినడానికి మోడల్ పేపర్లు ఎంతగానో ఉపయోగపడతాయని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నరేష్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శి మారుతి తెలిపారు. పాఠశాల హెచ్‌ఎం, పలువురు యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

జనతా దర్శన్‌ను వినియోగించుకోండి


మహిళలకు చెక్కు అందిస్తున్న దృశ్యం

పావగడ: సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు అమలు చేస్తున్న జనతా దర్శన్ కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కలెక్టర్ శుభ కల్యాణ్, ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ కోరారు. స్థానిక ఎస్ఎస్‌కే రంగ మందిరంలో మంగళవారం నిర్వహించిన జనతా దర్శన్‌లో వారు పాల్గొని ప్రజలనుంచి అర్జీలు స్వీకరించారు. వారు మాట్లాడుతూ జిల్లా, తాలూకా స్థాయి అధికారులు మీ వద్ద కే వచ్చి మీ సమస్యలు తీరుస్తారన్నారు. తుమకూరు జిల్లాకు రూ.138 కోట్ల పరిహారం అందించాల్సి ఉందని, పావగడకు అధిక మొత్తంలో పరిహారం మంజూరైందన్నారు. సంక్రాంతిలోగా లబ్ధిదారుల ఖాతాల్లోకి పరిహారాన్ని జమ చేస్తామన్నారు. అసిస్టెంట్ కమిషనర్ రిషి ఆనంద్, సీఈఓ జి ప్రభు, తహసీల్దార్ వరదరాజు తదితర అధికారులు పాల్గొన్నారు.

ఊరూరా మంత్రికి ఘన స్వాగతం


పూలకుంటలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హారతులిస్తున్న మహిళలు


చలివెందుల పంచాయతీలో మాట్లాడుతున్న నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్.దీపిక

హిందూపురం: నియోజకవర్గంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఊరూరా ఘన స్వాగతం పలికారు. నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ సమన్వయకర్త టీఎన్ దీపిక ఆధ్వర్యంలో పార్లమెంట్ సమన్వయకర్త బి.శాంతమ్మ, మంపంచాయతీల వారీగా పర్యటిస్తూ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలలో ఉత్సాహాన్ని నింపుతున్నారు. ఏ పంచాయతీకి వెళ్లినా పెద్దసంఖ్యలో మహిళలు, యువకులు ప్రజలు, వృద్ధులు సభకు విచ్చేసి నాయకుల ప్రసంగాలకు కరతాళధ్వనులతో మద్దతు తెలుపుతున్నారు. రెండో రోజు మంగళవారం మండలంలోని పూలకుంట, కగ్గల్లు, మనేసముద్రం, మలూగురు, బీరేపల్లి, చలివేందుల, బాలంపల్లి గ్రామ పంచాయతీల్లో వారు పర్యటించారు. ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని వారు కోరారు.

నేటి నుంచి మండల స్థాయి క్రీడాపోటీలు

మడకశిరరూరల్: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన టీమ్‌లకు బుధవారం నుంచి 20వ తేదీ వరకు మండల స్థాయి క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సోనిబాయి తెలిపారు. కల్లుమర్రి జెడ్పీ క్రీడామైదానంలో సీ కొడిగేపల్లి, బుళ్లసముద్రం జట్లకు, కల్లుమర్రి, మణూరు జట్లకు పోటీలు జరుగుతాయి. నీలకంఠాపురం క్రీడా మైదానంలో గోవిందాపురం, మెళవాయి, కే గుండుమల, కదిరేపల్లి, జీవీపాళ్యం జట్ల పోటీలు జరుగుతాయి. గౌడనహళ్లి క్రీడామైదానంలో ఛత్రం, చెందకచెర్లు, గౌడనహళ్లి, ఆమిదాలగొంది-1 జట్ల మధ్య, మధ్యాహ్నం మ్యాచ్ నంబర్ 8 విన్నర్ -ఆర్ అనంతపురం, మ్యాచ్ నంబర్ 9 విన్నర్, ఆమిదాలగొంది -2 జట్లకు పోటీలు జరుగుతాయి. మడకశిర జూనియర్ కళాశాల క్రీడామైదానంలో వైబీహళ్లి- అరేపేట జట్ల మధ్య, మాశేరొప్పం- కోటవీధి జట్ల మధ్య, సాయినగర్- హరేసముద్రం-1 క్రీడాకారుల మధ్య, మధ్యాహ్నం కొత్త ఎస్సీ కాలనీ, మ్యాచ్ -13 విన్నర్ జట్ల మధ్య క్రీడా పోటీలు జరుగుతాయి. రెండో రోజు గురువారం నీలకంఠాపురం క్రీడా మైదానంలో మ్యాచ్ నంబర్ 5 విన్నర్, మ్యాచ్ నంబర్ 6 విన్నర్ జట్ల మధ్య పోటీలు జరుగుతాయి. గౌడనహళ్లి క్రీడా మైదానంలో మ్యాచ్ నంబర్10 విన్నర్, మ్యాచ్ నంబర్ 11 విన్నర్ మధ్య పోటీలు జరుగుతాయి. మడకశిర జూనియర్ కళాశాల మైదానంలో హరేసముద్రం-2, మ్యాచ్ నంబర్ 14 విన్నర్ మధ్య, పెనుకొండ రోడ్డు- మ్యాచ్ నంబర్15 విన్నర్ మధ్య, మధ్యాహ్నం మ్యాచ్ నంబర్ 16 విన్నర్, మ్యాచ్ నంబర్ 17 విన్నర్ మధ్య, మ్యాచ్ నంబర్ 18 విన్నర్, మ్యాచ్ నంబర్ 19 మధ్య క్రీడాపోటీలు జరుగుతాయి. 19వ తేదీన మడకశిర జూనియర్ కళాశాల మైదానంలో మ్యాచ్ నంబర్ 3 విన్నర్, మ్యాచ్ నంబర్ 12 జట్ల మధ్య, మ్యాచ్ నంబర్20 విన్నర్, మ్యాచ్ నంబర్ 7 జట్ల మధ్య పోటీలు జరుగుతాయి. 20న మ్యాచ్ నంబర్ 21 విన్నర్, మ్యాచ్‌నంబర్ 22 విన్నర్ జట్ల మధ్య పోటీలు జరుగుతాయి.

రొళ్ల: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా 11 సచివాలయాల పరిధిలో గ్రామ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో విజేతలైనవారికి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం నుంచి ఈనెల 23 వరకు మండల స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు పీఈటీ మోహన్ తెలిపారు.

గోరంట్ల: ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీల నిర్వహణపై మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రఘునాథగుప్త అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ బుధవారం నుంచి ఈనెల 20 వరకు స్థానిక బాలుర ఉన్నత పాఠశాల, ఎస్‌ఏపీఎస్ జూనియార్ కళాశాల క్రీడా మైదానంలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు. పంచాయితీ కార్యదర్శులు, పీఈటీలు, డిజిటల్ సహాయకులు పాల్గొన్నారు.

12న గ్రామ సభ


రొళ్ల: ఉపాధి హామీ పనులపై నిర్వహించిన తనిఖీలకు సంబంధించి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఈనెల 12న గ్రామసభ నిర్వహించనున్నట్లు ఏపీఓ ఓబుళప్ప మంగళవారం తెలిపారు.

క్రీడా సామగ్రి పంపిణీ


కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

అమరాపురం: బసవనపల్లి గ్రామ సచివాలయంలో ఆడుదాం ఆంధ్రా క్రీడాకారులకు ఎంపీటీసీ నరసింహమూర్తి, సర్పంచ్ భాగ్యమ్మలు మంగళవారం క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. మండల స్థాయి క్రీడా పోటీల్లో రాణించాలని సూచించారు.

కొల్హాపురి మహాలక్ష్మికి పూజలు


అమ్మవారిని అలంకరించిన దృశ్యం

రొళ్ల: రత్నగిరి గ్రామంలో కొలువైన కొల్హాపురి మహాలక్ష్మిదేవి ఆలయంలో అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టు వస్త్రాలు, వెండి, బంగారు ఆభరణాలతో అమ్మవారికి అలంకరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాన్ని అందించారు. దాతల సహకారంతో భక్తులకు ప్రధాన అర్చకుడు వసంతచారి అన్నదానం చేశారు.

జగనన్న పాలనలో అర్హులందరికీ పథకాలు


మడకశిర మండలం గుండుమలలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మడకశిరరూరల్: అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల లబ్ధి చేకూర్చిన సీఎం వైఎస్ జగన్‌కు మళ్లీ మీ దీవెనలు అందించాలని తాలూకా వెఎస్సార్‌సీపీ బీసీ సెల్ కమిటీ నాయకుడు సత్యనారాయణరెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ నాగేంద్రయాదవ్ సూచించారు. గుండుమలలో మంగళవారం వై ఏపీనీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. రూ.15,34,66,946 కోట్లతో జరిగిన అభివృద్ధికి సంబంధించిన బోర్డును ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి జగనన్న నాలుగున్నరేళ్ల పాలనను ప్రజలకు వివరించారు. సర్పంచ్ రంగనాథ్, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి మంజునాథ్, జేసీఎస్ కన్వీనర్ జయప్ప, వివిధ కమిటీల సభ్యులు జయరాజ్, రంగనాథ్, రాజశేఖర్, శివగంగప్ప పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలి


మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీ చరణ్

సోమందేపల్లి: మండలంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కలిసికట్టుగా కృషి చేయాలని రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమ శాఖ మంత్రి, పార్టీ పెనుకొండ సమన్వయకర్త ఉషా శ్రీ చరణ్ పలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం మండలంలోని వైఎస్సార్ సీపీ శ్రేణులతో ఆమె సమావేశం ఏర్పాటు చేశారు. త్వరలో మండలంలో అన్ని గ్రామాల్లో తన పర్యటన ఉంటుందన్నారు. పార్టీ శ్రేణులకు అన్ని విధాలుగా అండగా ఉంటానని, వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో తనను గెలిపించాలని ఈ సందర్భంగా ఆమె విజ్ఞప్తి చేశారు. పార్టీలో విభేదాలు లేకుండా సమన్వయంతో పని చేసి నియోజకవర్గంలో పార్టీ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మండలంలో పర్యటించబోయే ప్రాంతాలకు సంబంధించి రూట్ మ్యాప్ పార్టీ శ్రేణులతో కలిసి సిద్ధం చేశారు. వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, మాజీ కన్వీనర్ వెంకటరత్నం, జెడ్పీటీసీ అశోక్, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు నాగభూషణం రెడ్డి, సర్పంచ్‌లు గంగాదేవి, సోము, జిలాన్ ఖాన్, కిష్టప్ప, కో ఆప్షన్ సభ్యుడు రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత


చెక్కు అందజేస్తున్న దృశ్యం

మడకశిర: పట్టణంలోని 7వ వార్డుకు చెందిన నాగరాజు రెండు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో మృతుడి భార్య మంజులమ్మకు వైఎస్సార్ బీమా పథకం కింద రూ.లక్ష చెక్కును మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు జయరాజు, వెల్ఫేర్ అసిస్టెంట్ ఓబుళపతి అందించారు. నాయకులు నవీన్ కుమార్, శ్రావణ్, నాగేంద్ర, మారుతి, చిన్న, అంజి తదితరులు పాల్గొన్నారు.

మావటూరులో క్రికెట్ పోటీలు


క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్: మావటూరు గ్రామంలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నీని మంగళవారం ప్రారంభించారు. విన్నర్స్‌కు ప్రథమ బహుమతి రూ.50 వేలు, రన్నర్స్‌కు రూ.25 వేలు బహుమతి అందించనున్నట్లు సుధాకర్‌రెడ్డి తెలిపారు. క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపేందుకే పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగరాజు, ఎంపీటీసీ శివయ్య, నాగభూషణ రెడ్డి, సుగుణాకర్ రెడ్డి,మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో కాన్పులు సురక్షితం

పరిగి: ప్రభుత్వాస్పత్రిలో ప్రసవాలు సురక్షితమని పరిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం మండల వ్యాప్తంగా ఉన్న గర్భిణులకు ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పలు వైద్య పరీక్షలను చేపట్టారు. అనంతరం స్థానిక దివ్య ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ పరిగి వేణుగోపాలరావు ఆధ్వర్యంలో భోజన వసతి కల్పించారు. మెడికల్ ఆఫీసర్లు రూబీ, సురేష్‌కుమార్, స్వరూపరెడ్డి, సీహెచ్ఓ వన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ సమావేశం

గోరంట్ల: పాలసముద్రం సమీపంలోని పెనుకొండ సమన్వయకర్త, స్త్రీ,శిశుసంక్షేమ మంత్రి ఉషశ్రీచరణ్ కార్యాలయంలో బుధవారం వైఎస్సార్‌సీపీ మండల స్థాయి సమావేశం జరగనుంది. ఈమేరకు పార్టీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, టౌన్ కన్వీనర్ ధనుంజయరెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. మంత్రి ఉషశ్రీ చరణ్ ఆధ్వర్యంలో సమావేశం జరుగుతుందని తెలిపారు. పార్టీ ముఖ్యనాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

జానపద కళను కాపాడాలి


డోలు వాయిస్తున్న కళాకారులు

పావగడ: గ్రామీణ ప్రజల జీవన విధానాన్ని ప్రతిబింబించే జానపద కళను కాపాడుకోవాలని రచయిత హోమా నాగరాజు సూచించారు. తాలూకాలోని నిడుగల్ సంస్థానంలో మంగళవారం నిర్వహించిన గ్రామీణ జానపద సంభ్రమ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. టీవీ సీరియళ్ల ప్రభావంతో జానపద కళ మరుగున పడిందన్నారు.ఈ కళను బతికించి భావి తరాలకు అందించాలన్నారు. అనంతరం కళాకారులు ప్రదర్శించిన కీలు గుర్రం, సోమన కుణిత, భజన, తత్వపద గాయన, గారడి బొమ్మ తదితర జానపద కళారూపాలు ఆకట్టుకున్నాయి. వాల్మీకి జాగృతి వేదిక అధ్యక్షుడు పాళేగార్ లోకేశ్ పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

హిందూపురం అర్బన్: ఆరోగ్యమే మహాభాగ్యమని డాక్టర్ గౌతమి అన్నారు. కారూడి పల్లిలో మంగళవారం వాసవ్య మహిళా మండలి, విప్రో కేర్ సహకారంతో కుశాల్‌హెల్త్‌కేర్ క్లినిక్ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వంద మందికి పైగా రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

ప్రభుత్వ కళాశాలలు ఏర్పాటు చేయాలి


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

హిందూపురం టౌన్: పట్టణంలో ప్రభుత్వ జూనియర్, ఉర్దూ జూనియర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని విద్యార్థి సంఘం నాయకులు కోరారు. మంగళవారం మండల పర్యటనలో ఉన్న మంత్రిని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డిలు కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు నరసింహమూర్తి, తరుణ్, దేవరాజ్, బాబాఫకృద్దీన్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ


పూలపల్లిలో పింఛన్ పంపణీ చేస్తున్న దృశ్యం

అగళి: మండల పరిధిలోని కోడిపల్లి పంచాయతీ పూలపల్లి గ్రామంలో మంగళవారం వలంటీర్లు, ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ పింఛన్ కానుకను లబ్ధిదారులకు అందజేశారు. రూ.3 వేల పింఛన్ అందుకున్న లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. ఎంపీపీ రేణుక, మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్, సర్పంచ్‌లు ముద్దరాజు, రామకృష్ణప్ప, వైఎస్సార్ సీపీ నాయకులు కామరాజు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట ప్రకారమే రూ.3 వేల పింఛన్


నూతన పింఛన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

పరిగి: ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్ మొత్తాన్ని రూ.3 వేలకు పెంచారని ఎంపీడీఓ సరస్వతి, ఎంపీపీ సవిత తెలిపారు. మంగళవారం పరిగి మండల కేంద్రంలోని వైకేపీ కార్యాలయంలో కొత్త లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఎంపీపీ సవిత, స్థానిక సర్పంచ్ లక్ష్మీదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మాటతప్పని, మడమ తిప్పని వ్యక్తి అని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ కార్యదర్శి ప్రభాకర్, జెడ్పీటీసీ శ్రీరామప్ప, స్పెషలాఫీర్ ప్రసాదరావు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ హుసేన్‌పీరా

అమరాపురం: స్థానిక పోలీస్ స్టేషన్‌ను పెనుకొండ డీఎస్పీ హుసేన్‌పీరా మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. కేసుల పరిష్కారంపై ఆరా తీశారు. కర్ణాటక మద్యం జిల్లాలోకి రాకుండా కట్టుదిట్టమైన నిఘా ఉంచాలని సీఐ సురేష్‌కుమార్, ఎస్ఐ వెంకటేశ్వర్లను ఆదేశించారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చూడాలని ఆయన సూచించారు.

సోమందేపల్లిలో..

సోమందేపల్లి: స్థానిక పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ హుస్సేన్‌పీరా మంగళవారం సాయంత్రం తనిఖీ చేశారు. పెండింగ్ కేసులు త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. మట్కా, పేకాట, మద్యం రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సీఐ రాజా రమేష్, ఎస్ఐ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.